సాక్షి నారాయణపేట

మంగళవారం : 8 : ఏప్రిల్ : 2025



బస్తా 'బరువు' కిరికిరి

తూకంలో బస్తా బరువు పెంచాలని వ్యాపారులు డిమాండ్ చేస్తూ టెండర్లు వేయలేదు.

వివరాలు 8లో ▸



నకిలీ వైద్యులపై కొరడా

దేవరకద్రలో నకిలీ వైద్యులపై రాష్ట్ర వైద్యాధికారులు కొరడా ఝుళిపించారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 39.8 /22.9

మధ్యాహ్నం వరకు ఎండగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.

సన్న బియ్యంపై నిఘా



మరికల్‌లోని రేషన్ దుకాణంలో సన్న బియ్యం తూకం వేస్తున్న డీలర్

- పక్కదారి పట్టకుండా రేషన్ దుకాణాలపై కన్నేసిన ఎన్‌ఫోర్స్‌మెంట్
- రోజువారి తనిఖీలు, నివేదికలు
- సన్నబియ్యంపై ఆసక్తి చూపుతున్న లబ్ధిదారులు

జిల్లా వివరాలిలా..	
మొత్తం రేషన్ దుకాణాలు : 301	రేషన్‌కార్డు లబ్ధిదారులు 1.44 లక్షలు
ఈ నెల విడుదలైన బియ్యం కోటా 3,382 మెట్రిక్ టన్నులు	

మరికల్: ఉగాది కానుకగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల నుంచి రేషన్ లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీని ప్రారంభించింది. దీంతో రేషన్‌దుకాణాల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. ఇదే సమయంలో బియ్యం పక్కదారి పట్టకుండా, దొడ్డు బియ్యాన్ని కలపకుండా ప్రజా పంపిణీ వ్యవస్థపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. అక్రమాలకు చోటు లేకుండా ప్రక్షాళన చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాల్ని రంగంలోకి దింపింది. జిల్లా వ్యాప్తంగా నిరంతరం ఎక్కడో ఒకచోట రేషన్ బియ్యం పట్టుబడుతునే ఉన్నాయి. కొన్ని రేషన్‌దుకాణాలు అక్రమాలకు నిలయంగా మారాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ తరుణంలో ఏప్రిల్ 1 నుంచి సన్న బియ్యం పంపిణీని ప్రభుత్వం ప్రారంభించింది. గతానికి భిన్నంగా టాస్క్‌ఫోర్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలను సమాయత్తం చేసి దుకాణాల్లో అక్రమాలకు తెరపడేలా పౌర సరఫరాల అధికార యంత్రాంగం పటిష్ట నిఘా కొనసాగిస్తోంది.

రేషన్ దుకాణాల చుట్టూ వ్యాపారులు

ఇన్నాళ్లు రేషన్ దుకాణాల అడ్డాగా జరిగిన బియ్యం అక్రమ దందాకు సన్నబియ్యం పంపిణీతో అడ్డు పడింది. ఎలాగైన తమ వ్యాపారం కొనసాగించాలనే ఉద్దేశంతో అక్రమ వ్యాపారులు జిల్లా వ్యాప్తంగా పాత పద్ధతి ప్రకారం రేషన్‌దుకాణాల వద్దకు వెళ్లి సన్నబియ్యం ఎలా ఉన్నాయి.. వాటిని ఏమైనా అమ్ముతారా అంటూ ఆరా తీస్తున్నారు. దొడ్డు బియ్యం కంటే కిలోకి రూ.5 ఎక్కువగా ఇస్తామంటూ బేరసారాలు ఆడుతున్నారు. ఇదే ఆశతో కొందరు డీలర్లు డబ్బులు కావాలా, లేక బియ్యం కావాలా అంటూ లబ్ధిదారులను రహస్యంగా అడగటం గమనార్హం. కొందరు అక్రమ బియ్యం వ్యాపారులు లబ్ధిదారుల ఇళ్ల దగ్గరకు వెళ్లి కిలో రూ.20కి డిమాండ్ చేస్తున్నారు. ఈ విషయంపై సివిల్ సప్లయ్ అధికారులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో బియ్యం వ్యాపారుల కదలికపై కన్నేసింది.

బియ్యం బాగున్నాయి



ప్రభుత్వం రేషన్ ద్వారా పంపిణీ చేసిన సన్న బియ్యం బాగున్నాయి. బువ్వ కూడా పొడి, పొడిగా అవుతోంది. గతంలో దొడ్డురకం బియ్యం బువ్వ మంచిగా ఉండేది కాదు. మార్కెట్‌లో క్వింటాల్ సన్నబియ్యం రూ.5 వేలకు కొనుగోలు చేసేవాళ్లం. ప్రస్తుతం రేషన్‌లో సన్న బియ్యం పంపిణీ చేయడంతో సంతోషంగా భోజనం చేస్తున్నాం.

– పాపన్న, కిష్టంపల్లి

బేరాలు ఆడుతున్నారు



లావు బియ్యం కొనుగోలు చేసే వ్యాపారులు సన్న బియ్యం కూడా అమ్ముతారా.. అంటూ ఇటీవల బేరాలు ఆడుతున్నారు. అమ్మేది లేదంటూ చెబుతుండడంతో వెనుదిరుగుతున్నారు. సన్న బియ్యం వండగా.. ఇంట్లో పిల్లలు సైతం బాగుంది అంటున్నారు. అందరి మాదిరిగా తాము కూడా సన్నబువ్వ భోజనం చేయడం ఆనందంగా ఉంది.

– భాగ్యమ్మ, మరికల్

పక్కదారి పడితే చర్యలు

జిల్లాలో మొత్తం రేషన్ దుకాణాలకు 3,382 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం అందించాం. బియ్యం పక్కదారి పట్టకుండా లబ్ధిదారులకు అందేలా చూస్తాం. కలెక్టర్ ఆదేశాలతో ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ అధికారులు రేషన్ దుకాణాలను పర్యవేక్షణ చేయిస్తున్నాం. అక్రమాలకు పాల్పడినా, లబ్ధిదారులకు సరైన సేవలు అందించకపోయినా డీలర్లపై చర్యలు తప్పవు.

– సైదులు, జిల్లా సివిల్ సప్లయ్ డీఎం, నారాయణపేట

సన్న బువ్వ సంబురం

రేషన్ దుకాణాల్లో ఇన్నాళ్లు లావు బియ్యం సరఫరా చేయడంతో లబ్ధిదారులు తినేందుకు ఇష్టపడేవారు కాదు. దీంతో ఇలా రేషన్ దుకాణాల్లో కొనుగోలు చేసి బయటికి రాగానే ఇతర వ్యాపారులకు, లేదా అదే డీలర్ ఏర్పాటు చేసిన వ్యక్తికి విక్రయించేవారు. అలా ఈ బియ్యం మిల్లులకు చేరవేసి రీసైక్లింగ్ చేసి తిరిగి ప్రభుత్వానికి లేదా.. పక్కన ఉన్న కర్ణాటకతోపాటు ఇతర రాష్ట్రాలకు బియ్యం తరలించేవారు. ఈ అక్రమ దందాకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం చౌకధర దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారులు ఎన్నాడు లేని విధంగా సన్న బియ్యం తీసుకెళ్లేందుకు పోటీ పడుతున్నారు. దీంతో ఒక్కో రేషన్ దుకాణంలో కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే బియ్యం కోటా ఖాళీ అవుతోంది. లబ్ధిదారులు సన్న బువ్వను సంబురంగా తినేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. జిల్లాలో ఏప్రిల్ నెలకు సంబంధించి 301 రేషన్ దుకాణాల్లో 1,44,472 రేషన్ కార్డుల లబ్ధిదారులకు బియ్యం కోటా కింద 3,382 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం కేటాయించారు.

రెగ్యులర్ 'రగడ'..!

పీయూలో జీఓ 21 లొల్లి



అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద జీఓ 21 ప్రతుల దహనం చేస్తున్న కాంట్రాక్ట్, పార్ట్ టైం లెక్చరర్లు

- శాశ్వత నియామకాలపై కాంట్రాక్ట్, పార్ట్ టైం అధ్యాపకుల్లో ఆందోళన
- దశల వారీగా తమను తొలగిస్తారని బెంబేలు.. పోరుబాటకు శ్రీకారం
- వీసీకి వినతి.. యూనివర్సిటీ ప్రాంగణంలో ప్రభుత్వ ఉత్తర్వు కాపీల దహనం
- డిగ్రీ, ఇంటర్ కాలేజీల్లో క్రమబద్ధీకరణ తమకు వర్తించదా అంటూ నిరసన గళం
- ఎన్నో ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నాం.. ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్ : పాలమూరు యూనివర్సిటీలో లొల్లి రాజుకుంది. విశ్వవిద్యాలయంలో అధ్యాపక పోస్టుల శాశ్వత భర్తీకి సంబంధించి ప్రభుత్వం ఇటీవల జారీ చేసిన జీఓ 21 కాంట్రాక్ట్, పార్ట్ టైం లెక్చరర్లలో అలజడి సృష్టిస్తుండగా.. రగడ మొదలైంది. దశలవారీగా తమను తొలగించేందుకు రంగం సిద్ధమవుతోందని.. ఎట్టి పరిస్థితుల్లోనూ ఊరుకునేది లేదని.. తమను క్రమబద్ధీకరించిన తర్వాతే శాశ్వత నియామకాలు చేపట్టాలంటూ సోమవారం వారు ప్రత్యక్ష పోరుకు శ్రీకారం చుట్టారు.

గత తొలగింపుల నేపథ్యంలో..

పీయూలో చివరిసారిగా 2014లో రెగ్యులర్ అధ్యాపక పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. అయితే భర్తీ ప్రక్రియలో అనేక అవాంతరాలు ఎదురయ్యాయి. ఎట్టకేలకు 2016లో రెగ్యులర్ అధ్యాపకుల నియామకాలు జరిగాయి. ఆంగ్ల విభాగంలో ఇద్దరు, తెలుగులో ముగ్గురు, కెమిస్ట్రీ, కామర్స్, పొలిటికల్ సైన్స్, మైక్రోబయాలజీ విభాగాల్లో ఒక్కొక్కరిని చొప్పున మొత్తం తొమ్మిది మంది అధ్యాపకులను తీసుకున్నారు. ఈ క్రమంలో ఎనిమిది మంది కాంట్రాక్ట్ అధ్యాపకులను తొలగించారు. దీంతో సీనియర్ కాంట్రాక్ట్ అధ్యాపకుడు భూమయ్య తదితరులు ఆందోళనలు చేపట్టారు. అనంతరం వారు తమకు న్యాయం చేయాలని కోరుతూ కోర్టును సైతం ఆశ్రయించారు. ప్రస్తుతం రెగ్యులర్ ప్రాతిపదికన అధ్యాపక పోస్టుల భర్తీకి రంగం సిద్ధమవుతుండడం.. గతంలో జరిగిన తొలగింపుల నేపథ్యంలో కాంట్రాక్ట్ లెక్చరర్లు అభద్రతా భావానికి లోనవుతున్నట్లు తెలుస్తోంది.

అనుభవానికి వెయిటేజీ ఇస్తున్నా..

నూతనంగా నియామకాలను మూడు దశల్లో చేపట్టనున్నారు. మొదటి దశలో 50 మార్కులు.. వీసీ, ఉన్నత విద్యామండలి సభ్యుడు, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్, హెచ్‌ఓడీ కన్వీనర్‌గా ఉండే స్క్రూటినీ కమిటీ పలు కొలమానాల ఆధారంగా మార్కులు కేటాయించనుంది. రెండో దశలో మొత్తం 30 మార్కులు.. ఇందులో బోధనానుభవం ఉన్న వారికి ఒక్క సంవత్సరానికి ఒక్క మార్కు చొప్పున గరిష్టంగా 10 మార్కులు, డెమోకు 10 మార్కులు, పుస్తక రచన, రీసెర్చ్ ఫెలోషిప్ ఇలా మొత్తం 10 మార్కులు కేటాయించనున్నట్లు సమాచారం. మూడో దశలో ఇంటర్వ్యూకు 20 మార్కులు కేటాయించనున్నారు. మొత్తంగా 100 మార్కులకు సంబంధించి అత్యధిక మార్కులు సాధించిన వారికి మాత్రమే ఉద్యోగం పొందే అవకాశం ఉంది. నియామకాల్లో అనుభవానికి వెయిటేజీ ఇస్తున్న క్రమంలో ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులకు మేలు జరిగే అవకాశం ఉంది. అయితే అంతా సవ్యంగా జరుగుతుందా? గతంలో ఏం జరిగిందో అందరికీ తెలుసని.. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామన్నారు. తమను క్రమబద్ధీకరించిన తర్వాతే మిగిలిన పోస్టులను రెగ్యులర్ ప్రాతిపదికన భర్తీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

త్వరలో 22 పోస్టులకు నోటిఫికేషన్..

యూనివర్సిటీలో ప్రస్తుతం 16 మంది రెగ్యులర్ అధ్యాపకులు పనిచేస్తున్నారు. వీరితో పాటు 93 మంది కాంట్రాక్ట్, 60 మంది పార్ట్‌టైం ప్రతిపాదికన విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో చాలా మంది ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారు. పీయూలో మొత్తం 58 రెగ్యులర్ పోస్టులు కాగా.. గతంలో 16 భర్తీ చేశారు. ఇవి పోను 42 రెగ్యులర్ పోస్టులను భర్తీ చేయాల్సి ఉంది. ఇందులో కనీసం 22 పోస్టులకు త్వరలో నోటిఫికేషన్ ఇచ్చి.. భర్తీ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. పీయూలో ప్రభుత్వం రెగ్యులర్ అధ్యాపకులను నియమిస్తే.. ఆయా విభాగాల్లో కొన్ని సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను తొలగించే అవకాశం ఉన్నట్లు ప్రచారం జోరుగా సాగుతోంది.

మాకు న్యాయం చేయాలి..



ప్రభుత్వం జీఓ నంబర్ 21ని వెంటనే రద్దు చేయాలి. ఇచ్చిన హామీలో భాగంగా డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న అధ్యాపకులను ప్రభుత్వం క్రమబద్ధీకరించింది. కానీ పాలమూరు యూనివర్సిటీలో పనిచేస్తున్న వారిని క్రమబద్ధీకరించలేదు. ఇదెక్కడి న్యాయం? ప్రభుత్వం ఇప్పటికైనా పీయూలో కాంట్రాక్ట్ లెక్చరర్లను క్రమబద్ధీకరించాలి. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉద్యోగ భద్రత కల్పించేలా న్యాయం చేయాలి. ఆ తర్వాత మిగిలిన పోస్టులను రెగ్యులర్ ప్రతిపాదికన భర్తీ చేయాలి.

– రవికుమార్, పీయూ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

ఆందోళనలు తీవ్రతరం చేస్తాం..



యూనివర్సిటీ ప్రారంభం నుంచి పీయూలో లెక్చరర్లుగా విధులు నిర్వర్తిస్తున్నాం. అయినా ఎలాంటి ఉద్యోగ భద్రత లేకుండా పోయింది. 2016లో రెగ్యులర్ పోస్టుల్లో సీనియర్లను పక్కన బెట్టి భర్తీ చేశారు. ఉద్యోగ విరమణకు దగ్గరగా వస్తున్నాం. వెంటనే ప్రభుత్వం జీఓ 21ను రద్దు చేసి క్రమబద్ధీకరించాలి. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని యూనివర్సిటీల్లో నిరసనలు తీవ్రతరం చేస్తాం.

– భూమయ్య, పీయూ టీచర్స్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు

ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా..



కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం. ఒకవేళ తొలగించాల్సిన పరిస్థితి వస్తే కొత్త కోర్సులు, పీజీ సెంటర్లలో సర్దుబాటు చేస్తాం. ఎవరిని తొలగించాలనే ఉద్దేశం లేదు. కాంట్రాక్ట్ అధ్యాపకులందరికీ న్యాయం చేసేలా నా వంతు కృషి చేస్తా.

– శ్రీనివాస్, వీసీ, పాలమూరు యూనివర్సిటీ

మేమెందుకు అర్హులం కాదు ?

ఇటీవలి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో అర్హత ఉన్న అధ్యాపకులను ప్రభుత్వం రెగ్యులర్ చేసిన విషయం తెలిసిందే. పీయూ ఏర్పాటైనప్పటి నుంచి లెక్చరర్లుగా పనిచేస్తున్నామని.. అయినా తమను క్రమబద్ధీకరించపోవడం అన్యాయమని కాంట్రాక్ట్, పార్ట్ టైం లెక్చరర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మేమెందుకు అర్హులం కాదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం పీయూ వైస్‌చాన్సలర్ శ్రీనివాస్, నూతన రిజిస్ట్రార్ రమేష్‌బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. తాము ఎన్నో ఏళ్లుగా కాంట్రాక్ట్, పార్ట్ టైం ప్రాతిపదికన లెక్చరర్లుగా చేస్తున్నామని.. తమను రెగ్యులర్ చేసిన తర్వాత మాత్రమే మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం పీయూలోని అడ్మినిస్ట్రేషన్ భవనం వద్ద జీఓ 21 ప్రతులను దహనం చేశారు. సమస్యను పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

న్యూస్‌రీల్

'ప్రజావాణి'కి 25 ఫిర్యాదులు

నారాయణపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 25 ఫిర్యాదులు అందాయని కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఫిర్యాదుదారులతో కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్ నేరుగా వినతులు స్వీకరించారు. వారి సమస్యలు విన్నారు. సత్వరం వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు నాలుగు..

సబ్ డివిజన్ పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ గ్రీవెన్స్‌కు నాలుగు అర్జీలు అందాయని డీఎస్పీ లింగయ్య తెలిపారు. ఫిర్యాదుదారులు సమస్యలపై ఆయన ఆరా తీశారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.

ముదిరాజ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి



నారాయణపేట: ముదిరాజ్‌లు కేవలం ఓటు బ్యాంకుగా ఉండొద్దని.. అన్ని రంగాల్లో రాణించాలని.. ముదిరాజ్ బిడ్డని కాబట్టే మంత్రి రేసులో ఉన్నానని మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో జిల్లా మత్స్య సహకార సంఘం మొదటి సర్వ సభ్య సమావేశం ఏ.కాంత కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన పిల్లలకు బీసీ డీ నుంచి బీసీ ఏ సర్టిఫికెట్ ఇప్పించినప్పుడే వారికి మంచి భవిష్యత్తు ఇచ్చిన వారమవుతామన్నారు. మత్స్యసంపదను ఏ విధంగా వృద్ధి చేయాలో ఆలోచించాలని సూచించారు. జిల్లాకు త్వరలో మత్స్య మహిళా సంఘాలకు ఫిష్ క్యాంటీన్లు, ఫిష్ మార్కెటింగ్ ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ అన్నారు. కుంభం శివకుమార్‌రెడ్డి, జ్ఞానేశ్వర్, సదాశివ రెడ్డి, రాజేష్, కోనగిరి హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



లంకాల్ గ్రామంలో లబ్ధిదారురాలు ఇంట్లో భోజనం చేస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

నారాయణపేట: ప్రతి గ్రామంలో మెరుగైన వైద్య సేవలు అందాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం నారాయణపేట మండలంలోని అప్పక్‌పల్లి వద్ద గల ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రామ్ కిషన్ అధ్యక్షతన నిర్వహించారు. కలెక్టర్‌తోపాటు ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, కాళోజి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. రన్‌ఫర్ హెల్త్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... వైద్య కళాశాల విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఒకే సంవత్సరంలో ఎంబీబీఎస్, నర్సింగ్, పారా మెడికల్ కాలేజీని ప్రారంభించామని, త్వరలో మదర్ అండ్ చైల్డ్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ నందకుమార్ మాట్లాడుతూ.. నారాయణపేట మెడికల్ కాలేజీ పురోగతిలో ఉందని, కళాశాలకు అవసరమైన నిధులను మంజూరు చేస్తామని, లైబ్రరీకి అవసరమైన 4 వేల పుస్తకాలను పంపిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త కే పురుషోత్తం రెడ్డి పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ దాసరి ప్రసాద్‌రావు, డాక్టర్ విజయ్ సీనియర్ జర్నలిస్టు పంతంగి రాంబాబు,సామాజిక వేత్త కుంభం శివ కుమార్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి , రెడ్ క్రాస్ చైర్మన్ సుదర్శన్ రెడ్డి, వైద్య నిపుణులు ఆదిత్య, చంద్ర మోహన్, తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపునింపేందుకే..

నర్వ: పేదల కడుపునింపేందుకే రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తుందని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. సోమవారం నర్వ మండలంలోని లంకాల్‌లో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి సన్నబియ్యం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారు రేణుక ఇంట్లో భోజనం చేశారు. అనంతరం గ్రామంలో రూ.20 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు నిర్మాణ పనులు, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ శ్రీనువాసులు, ఏఓ అఖిలారెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణారెడ్డి,శరణప్ప, బీసం రవికుమార్, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు



మాట్లాడుతున్న ఎన్‌సీపీఈ సంస్థ ప్రతినిధులు

మద్దూరు: నూతనంగా ఏర్పడిన మద్దూరు మున్సిపాలిటీ సమగ్రాభిద్ధికి ప్రణాళికలు సిద్ధం చేస్తామని ఎన్‌సీపీఈ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టు ఇంజినీర్ మహ్మమద్ సిద్దికి తెలియజేశారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో మున్సిపల్ కమిషన్ శ్రీకాంత్, మద్దూరు, రెనివట్ల గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులతో సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ మున్సిపాలిటీ మరో 30 ఏళ్ల వరకు సరిపడా ప్రణాళికలు రుపొందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. మీమీ గ్రామాల్లో అత్యంత ప్రాధాన్యత అంశాలను మాకు తెలియజేయాలని కోరారు. దీంతో వారు పలు సూచనలు చేశారు. రెండు నెలల పాటు మున్సిపాలిటీలో తిరిగి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ మహేష్, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు సంజీవ్, మల్లీకార్జున్, బాబు స్వామి, చంద్రమోహన్, శ్రీనావాస్‌రెడ్డి, ఆశోక్, యసిన్, చందు, రామక్రిష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చివరి ఆశలు..



నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం చొక్కనపల్లికి చెందిన రైతు కుడుముల శశిధర్‌రెడ్డి కేఎల్‌ఐ కాల్వల ద్వారా వచ్చే సాగునీటిని నమ్ముకొని తనకున్న ఏడు ఎకరాల్లో వరి పంట సాగు చేశాడు. అయితే సుమారు 40 రోజులుగా కేఎల్‌ఐ కాల్వ ద్వారా సాగునీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో శశిధర్‌రెడ్డికి చెందిన మూడు ఎకరాల్లో వరి పూర్తిగా ఎండిపోయింది. ఇప్పటికే రూ.60 వేల నష్టం వచ్చిందని బాధిత రైతు వాపోయాడు.

కేఎల్ఐ కింద నెలరోజులుగా నిలిచిన నీటి సరఫరా

- వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో ఎండిన మొక్కజొన్న, వరి పంటలు
- జూరాల నుంచి నేడు, రేపు కొనసాగనున్న నీటి విడుదల
- కేవలం రెండు మండలాల రైతులకే అందనున్న సాగునీరు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చివరి దశలో పంటలు కాపాడుకునేందుకు అన్నదాతల అగచాట్లు

సాక్షి, నాగర్‌కర్నూల్: చివరి దశలో ఉన్న పంటలు కాపాడుకునేందుకు అన్నదాతలు అగచాట్లు పడుతున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా సాగునీటి ప్రాజెక్టులు, కాల్వలను నమ్ముకుని వరి, మొక్కజొన్న, చెరకు తదితర పంటలను సాగుచేయగా.. గత కొన్ని రోజులుగా సక్రమంగా నీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. చేతికి వచ్చే దశలో ఉన్న పంటలు ఎండిపోతుంటే రైతన్నలు తల్లడిల్లిపోతున్నారు.

మూడు రిజర్వాయర్లలో..

కేఎల్‌ఐ పరిధిలోని మూడు రిజర్వాయర్లలో నీటిని నింపి, సమీపంలోని ప్రాంతాలకే సాగునీటిని అందిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ కింద చేపట్టిన ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లి రిజర్వాయర్లలో నీటిని నింపేందుకే సరిపెడుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టు ఆయకట్టు, కాల్వల కింద పంటలు సాగు చేసిన రైతులకు నీరందక సతమతమవుతున్నారు. అయితే నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో కేఎల్‌ఐ కాల్వ ద్వారా 40 రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో ఆయా మండలాల్లోని వరి, మొక్కజొన్న, వేరుశనగ పంటలు ఇప్పటికే ఎండిపోయాయి. మిగతా పంటలనైనా కాపాడుకునేందు కు కూడా నీరిచ్చే పరిస్థితి కనిపించడం లేదు. కాల్వ నీటిని నమ్ముకుని పంటలు సాగుచేస్తే.. పంటలు ఎండి పెట్టుబడి సైతం మీదపడే పరిస్థితి దాపురించిందని రైతులు వాపోతున్నారు.



వెల్దండ మండలం చొక్కనపల్లిలో ఎండిన వరి పంట

రెండురోజుల పాటు..

జూరాల ప్రాజెక్టు ఆయకట్టు పరిధిలో ఇప్పటికే సాగై చివరిదశలో ఉన్న పంటల కోసం చివరి విడతగా మంగళ, బుధవారాలు రెండు రోజుల పాటు కాల్వల ద్వారా అధికారులు నీటిని సరఫరా చేయనున్నారు. వీటిలో జూరాల ఎడమ కాల్వ ద్వారా 550 క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 350 క్యూసెక్కుల నీటిని ఆయకట్టుకు విడుదల చేస్తారు. ఈ రెండు రోజుల్లో కాల్వల ద్వారా మొత్తం 0.2 టీఎంసీల నీటిని చివరి విడతగా ఆయకట్టుకు సరఫరా చేయనున్నారు.

రెండు మండలాలకే కుదింపు

వాస్తవానికి జూరాల ఎడమ కాల్వ ద్వారా వనపర్తి జిల్లాలోని అమరచింత, ఆత్మకూరు, మదనాపురం, కొత్తకోట, పెబ్బేరు, శ్రీరంగాపురం, చిన్నంబావి, వీపనగండ్ల మండలం గోపాల్‌దిన్నె రిజర్వాయర్ వరకూ సాగునీటి సరఫరా జరగాల్సి ఉంది. కానీ, ఈసారి యాసంగి సీజన్‌కు ముందు నుంచే ఆయకట్టు పరిధిని కేవలం రెండు మండలాలకే కుదించారు. ప్రస్తుతం జూరాల ఎడమ కాల్వ ద్వారా సరఫరా చేస్తున్న నీరు అమరచింత, ఆత్మకూర్ మండలాల్లోని ఆయకట్టుకే అందనుంది. దీంతో మిగతా మండలాల రైతులు తమ పంటల పరిస్థితి ఏమైపోవాలని ఆందోళన చెందుతున్నారు.

మిగిలింది అర టీఎంసీనే..

జూరాలలో నీరు రోజురోజుకూ అడుగంటుతోంది. ప్రస్తుతం రిజర్వాయర్‌లో కేవలం 3.165 టీఎంసీల నీరు మాత్రమే అందుబాటులో ఉంది. ఇందులో 2.5 టీఎంసీల వరకు డెడ్ స్టోరేజీ కింద ఉండగా.. ఇక మిగిలింది అర టీఎంసీ మాత్రమే. ఈ నీటినే ఆయకట్టు కింద చివరి విడతగా నీటి విడుదలతోపాటు వేసవికాలం ముగిసే వరకు తాగునీటికి వాడుకోవాల్సి ఉంటుంది. వేసవిలో నీటి ఎద్దడిని దృష్టిలో ఉంచుకుని గత ఫిబ్రవరిలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, శ్రీధర్‌బాబు కలిసి కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి డీకే శివకుమార్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి జూరాలకు 4 టీఎంసీలను విడుదల చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు 2 టీఎంసీలకు మించి నీరు రాలేదని చెబుతున్నారు.

క్లుప్తంగా

లారీ నుంచి జారిపడి వ్యక్తి మృతి

మానవపాడు: మండలంలోని జల్లాపురం శివారులో జాతీయ రహదారిపై లారీ ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు కిందపడి గాయపడిన ఎండీ ఇమ్రాన్ (24) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్ఐ చంద్రకాంత్ వివరాల మేరకు.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఎండీ ఇమ్రాన్ లారీలో గోధుమ లోడ్‌తో బెంగళూరుకు బయలుదేరాడు. ఈ నెల 4న జల్లాపురం శివారులోని ఆర్టీఏ చెక్‌పోస్టులో వాహనానికి సంబంధించిన పత్రాలను అధికారులకు చూపించి.. తిరిగి లారీ ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తు జారీ కిందపడి గాయపడ్డాడు. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి బాబాయ్ ఇక్బాల్ అహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

కోస్గి రూరల్: మండలంలోని బిజ్జారం గ్రామానికి చెందిన కురువ మల్లప్ప(45) వారం రోజుల క్రితం గడ్డి మందు తాగి హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు. వివరాలు.. గ్రామానికి చెందిన కురవ మల్లప్ప కుటుంబంలో తన మాటకు ఎవరూ విలువ ఇవ్వడం లేదని మనస్తాపం చెందాడు. వ్యవసాయ పొలంలో గడ్డి మందు తాగాడు. కుటుంబీకులు హుటాహుటిన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రధాన ఆస్పత్రికి తరలించారు. గడ్డి మందు శరీరం అంతా వ్యాపించడంతో వారం రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించాడు. ఈ విషయమై తల్లి కురువ బసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

అచ్చంపేట రూరల్: మండలంలోని పల్కపల్లి రైతువేదిక సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించిందని ఎస్ఐ రమేష్ తెలిపారు. సోమవారం ఉదయం అటుగా వెళ్లిన స్థానికులకు మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వ్యక్తి వయస్సు 35–40 వరకు ఉండొచ్చని, శరీరంపై చొక్కా లేదని, నీలం కలర్ జీన్స్ ప్యాంటు ధరించాడని చెప్పారు. వ్యక్తిని ఎవరైనా గుర్తిస్తే అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

జడ్చర్ల: స్థానిక కావేరమ్మపేటకు చెందిన ఏలియాజర్(42) తన ఇంట్లో ఉరి వేసుకొని ఆదివారం ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.తమ దాయాది కరుణాకర్ కుటుంబసభ్యులు తన భర్త ఏలియాజర్‌పై దాడి చేసి కొట్టారని, దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నట్లు మృతుడి భార్య రోజమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో గొడవ..

- ఇరువురిపై కేసు నమోదు

నవాబుపేట: మద్యం మత్తులో పాత బాకీ విషయంలో ఇద్దరి మధ్య మాటకు మాట పెరగడంతో ఒకరిని దాడిచేసి గాయపర్చారు. ఈ ఘటనలో పరస్పరం ఫిర్యాదు చేయగా ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ విక్రమ్ తెలిపారు. వివరాలు.. ఆదివారం మండల కేంద్రం సమీపంలో నవాబుపేటకు చెందిన సురేష్ మద్యం తాగేందుకు శివకుమార్‌ని పిలిచాడు. సురేష్ వెంట వడ్డె చిన్న, మని కూడా వచ్చారు. కాగా పాత బాకీ విషయంలో శివకుమార్‌కు, చిన్నకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కాగా సురేష్, చిన్న, మనిలు కలిసి శివకుమార్‌పై దాడి చేశారు. గాయపడ్డ శివ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మాందువాద సురేష్ ఇంటిపైకి వచ్చి అతడి భార్యను శివకుమార్, అతడి బంధువులు దాడి చేశారంటూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి

తెలకపల్లి: కుక్కల దాడిలో గొర్రెపిల్లలు మృతి చెందిన ఘటన మండలంలోని జంగమోనిపల్లిలో చోటుచేసుకొంది. బాధితుడు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కొట్టే రాంచంద్రయ్య గొర్రెమందలు ప్రతిరోజు ఉంచినట్లుగానే సోమవారం గొర్రెల మంద వద్ద చిన్న గొర్రెల ఉంచి రోజుమాదిరిగా గొర్రెల మేపడానికి వెళ్లాడు. మందలో ఉంచిన గొర్రె పిల్లలపై కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి మొత్తం 23 గొర్రె పిల్లలను చంపాయి. సాయంత్రం వచ్చి చుసే సరికి గొర్రె పిల్లలు చనిపోయాయి. రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

బస్తా బరువు కిరికిరి



బాదేపల్లి యార్డులో టెండర్లు వేయకపోవడంతో షెడ్లలోనే ఉన్న మొక్కజొన్న కుప్పలు

బాదేపల్లి మార్కెట్‌లో నిలిచిన మొక్కజొన్న కొనుగోళ్లు

- తూకంలో బస్తా బరువు పెంచాలని వ్యాపారుల డిమాండ్
- ఇప్పటికే 500 గ్రాముల బస్తా బరువుకు 400 గ్రాముల అధిక తూకం
- 1,200 గ్రాములకు పెంచాలంటున్న వ్యాపారులు
- దోపిడీపై రైతుల ఆందోళన

జడ్చర్ల: ఉమ్మడి జిల్లాలో అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ యార్డుకు పేరొందిన బాదేపల్లి మార్కెట్‌లో వ్యాపారులు బస్తా 'బరువు' కిరికిరి చేస్తున్నారు. ఆరుగాలం ఎంతో కష్టపడి పండించిన పంటను అమ్ముకోవడానికి మార్కెట్‌కు తీసుకొస్తే.. అక్కడ వ్యాపారులు పెట్టే నిబంధనలు తలనొప్పిగా మారింది. సోమవారం మార్కెట్‌లో వ్యాపారులు టెండర్లు వేయకపోవడంతో మొక్కజొన్న క్రయవిక్రయాలు ఒక్కసారిగా నిలిచిపోయాయి. టెండర్లు వేయాలని మార్కెట్‌యార్డు అధికారులు ఆయా వ్యాపారులకు విజ్ఞప్తి చేసినా వారు ఖాతరు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. మార్కెట్ చైర్‌పర్సన్ జ్యోతి, యార్డు కార్యదర్శి నవీన్‌కుమార్ నచ్చజెప్పినా వారు వినలేదు. దీంతో వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మొక్కజొన్నను విక్రయించేందుకు వచ్చిన రైతులు మార్కెట్‌లో కుప్పల వద్దే పడిగాపులు పడ్డారు. చివరకు స్థానిక ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి జోక్యం చేసుకోవడంతో దిగివచ్చిన వ్యాపారులు సాయంత్రం టెండర్లు వేశారు.

వ్యాపారుల ఏకపక్ష నిర్ణయం..

మార్కెట్‌లో క్రయవిక్రయాలు పారదర్శకంగా సాగడం లేదనడానికి ఇదో నిదర్శనం. వాస్తవంగా తూకాల సమయంలో బస్తా బరువు ఎంత ఉంటే అంత అధికంగా ధాన్యం, తదితర పంట దిగుబడులను తూకం వేయడం అనవాయితీగా వస్తోంది. గతంలో కాంటాలో తూకం వేసే కాలంలో ఓ వైపు తూకం బాట్లతో పాటు ఓ బస్తాను వేసి తూకం చేసేవారు. ఇలా తూకం చేయడం వలన అటు రైతుకు ఇటు వ్యాపారికి ఎలాంటి నష్టం ఉండేది కాదు. ప్రస్తుతం డిజిటల్ తూకం యంత్రాలు రావడంతో బస్తా బరువు ప్రకారంగా మొదట 500 గ్రాములు (అర కిలో) అదనంగా తూకం వేసేవారు. తదుపరి బస్తా బరువును సంబంధిత వ్యాపారులు ఎవరి అనుమతి లేకుండా పెంచుకుంటూ పోయారు. 500 గ్రాముల నుంచి 700 గ్రాములకు, ఆ తర్వాత 900 గ్రాముల వరకు పెంచారు. అంటే అర కిలో బస్తా బరువుకు అదనంగా 400 గ్రాముల పంట ఉత్పత్తులను వ్యాపారులు అదనంగా దోచుకోవడం మొదలుపెట్టారు. తాజాగా ఇదే బరువును మరో 300 గ్రాములు అంటే 1,200 గ్రాములు పెంచాలంటూ వ్యాపారులు డిమాండ్ చేస్తున్నారు. మార్కెట్ అధికారులు, రైతులకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా వ్యాపారులంతా కుమ్మక్కై ఏకపక్షంగా నిర్ణయం తీసుకొని సోమవారం కొనుగోళ్లు నిలిపివేశారు. మార్కెట్ కార్యదర్శి నవీన్‌కుమార్, వ్యాపార సంఘం అధ్యక్షుడు పరుశవేది తదితరులు చర్చలు జరిపినా వారు దిగిరాలేదు.

ఇంత దోపిడీ సరికాదు..



మార్కెట్‌కు 80 బస్తాల మొక్కజొన్న తెచ్చాను. రైతులను దోచుకోవడమే పనిగా వ్యాపారం చేయడం తగదు. బస్తా బరువు కంటే అదనంగా మరో కిలో వరకు దోచుకుంటున్నారు. ఇదెక్కడి న్యాయం. ఇంత దారుణం ఎక్కడయినా ఉందా. రేయింబవళ్లు కష్టపడి పండించిన పంటలను అమ్మడానికి తెస్తే మార్కెట్‌లో ఇంత దారుణంగా దోచుకోవడం సరికాదు.

– రాములు, రైతు, గొల్లపల్లి

మోసం చేస్తున్నారు..



రైతులను మార్కెట్‌లో వ్యాపారులు మోసం చేస్తున్నారు. ఇక్కడికి వచ్చి అమ్ముకోవడం కంటే తమ పొలాల వద్దనే స్థానిక వ్యాపారులకు అమ్ముకోవడం మేలుగా ఉంది. ఇంత దూరం తీసుకువచ్చి ఇక్కడి వ్యాపారులకు అయినకాడికి అమ్ముకుపోయే దుస్థితి రావడం దురదృష్టం.

– ముత్యాలు, రైతు, చౌదర్‌పల్లి

తూకం బరువు పెంచే ప్రసక్తే లేదు..



వ్యాపారులు డిమాండ్ చేసినట్లు అదనంగా ఒక్క గ్రాము బరువు కూడా పెంచబోము. యథావిధిగా తూకాలు కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటాం. వ్యాపారులు సమాచారం ఇవ్వకుండా టెండర్లు వేయకపోవడం సరికాదు. కొనుగోళ్లు సవ్యంగా సాగే విధంగా చర్యలు చేపడుతాం.

– జ్యోతి, మార్కెట్ చైర్‌పర్సన్, బాదేపల్లి

దిక్కుతోచని స్థితిలో రైతులు

మార్కెట్‌లో వ్యాపారులు టెండర్లు వేయకపోవడంతో రైతులు దిక్కుతోచనిస్థితిలో పడ్డారు. శని, ఆది వారాలు మార్కెట్‌కు సెలవులు ఉండడంతో సోమవారం 10 వేల బస్తాలకు పైగా మొక్కజొన్న విక్రయానికి వచ్చింది. మధ్యాహ్నం రెండు గంటల వరకు టెండర్లు వేయకపోవడంపై రైతులు ఆరా తీయడంతో అప్పుడు విషయం తెలిసింది. అసలే అకాల వర్షాల భయం వెంటాడుతుందని.. ఈ స్థితిలో యార్డులో కుప్పల వద్ద పడిగాపులు పడాల్సిన దుస్థితి ఏర్పడిందని వారని వాపోయారు. ముందస్తుగా సమాచారం తెలిసి ఉంటే యార్డుకు తీసుకువచ్చే వారమే కాదన్నారు.

చర్యలు తప్పవు: ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

రైతులను ఇబ్బందులు పెట్టే వారిపై చట్టపరంగా వ్యవహరిస్తామని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి హెచ్చరించారు. బస్తా బరువు కంటే అదనంగా ఒక్క గ్రాము కూడా ఎక్కువ ఇచ్చేది లేదని స్పష్టం చేశారు. నిబంధనల మేరకు చర్యలు చేపట్టలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కాగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు మొదలు రైతులకు ఇబ్బందులు కలగనీయకుండా టెండర్లు వేయాలని మరోసారి యార్డు కార్యదర్శి నవీన్‌కుమార్ వ్యాపారులకు నచ్చజెప్పడంతో టెండర్లు వేశారు.

అడుగడుగునా ఆటంకాలే..



సొరంగంలో చేపడుతున్న సహాయక చర్యలు

- 45 రోజులుగా చేపడుతున్న సహాయక చర్యలు
- 24 గంటలు కొనసాగుతున్న అన్వేషణ
- నేటికీ లభ్యం కాని ఆరుగురి ఆచూకీ
- రోజుకు 20మీటర్ల చొప్పున మట్టి తొలగింపు
- నీటి ఊట భారీ యంత్రాలతో తోడివేత

అచ్చంపేట: శ్రీశైలం ఎడమగట్టు కాలువ(ఎస్ఎల్‌బీసీ)సొరంగంలొ చిక్కుకున్న వారిని రక్షించేందుకు చేపడుతున్న సహాయక చర్యలకు అడుగడుగునా ఆటంకాలే ఎదురౌతున్నాయి. సహాయక చర్యలు సోమవారం 45వ రోజుకు చేరుకున్నాయి. ఎనిమది మంది కార్మికులు సొరంగం ప్రమాదంలో చిక్కుకోగా ఇద్దరి మృతదేహాలను వెలికితీశారు. మిగిలిన ఆరుగురి కోసం నాటి నుంచి నేటి వరకు గాలిస్తున్నా ఇప్పటివరకు వారి ఆచూకీ లభ్యం కాలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చెందిన 12 రకాల బృందాల సిబ్బంది సొరంగం లోపల అత్యాధునిక పరికారాలను ఉపయోగించి 24గంటల పాటు సొరంగంలో క్షుణంగా పరిశీలిస్తున్నారు. సహాయక సిబ్బంది ఎప్పటికప్పుడు చేపడుతున్న సహాయక చర్యలపై ప్రభుత్వ ఉన్నతాధికారులకు నివేదిస్తూ సొరంగంలో పనులు చేపడుతున్నారు. సొరంగంలో 15 అడుగుల మేర పేరుకుపోయిన మట్టి, బురద, రాళ్లు, రప్పలను తొలగిస్తూ ముందుకు సాగుతున్నారు. సహాయక చర్యలకు అడ్డుగా వస్తున్న టీబీఎం భాగాలను దక్షిణ మధ్య రైల్వే సిబ్బంది గ్యాస్ కట్టర్‌తో కట్ చేస్తూ అదే ఉత్సాహంతో రోజుకు 20మీటర్ల చొప్పున మట్టి తొలగిస్తున్నారు. ఐదు ఎస్కవేటర్ల సహాయంతో మట్టి, బురద, రాళ్లను తొలగిస్తూ కన్వేయర్ బెల్టు ద్వారా బయటకు తరలిస్తున్నారు.

సహాయక చర్యలు ముమ్మరం

ఎస్ఎల్‌బీసీ సొరంగం లోపల ప్రమాదం జరిగిన ప్రదేశంలో సహాయక చర్యలు ముమ్మరం చేశారు. సొరంగం ప్రమాదానికి కారణమైన నీటి ఊటను నిల్వరించేందుకు సహాయక సిబ్బంది విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఎప్పటికప్పుడు నీటి ఊటను భారీ యంత్రాల సహాయంతో సొరంగం బయటకు పంపింగ్ చేస్తున్నారు. ఆర్మీ, ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్, సింగరేణి, హైడ్రా, రైల్వే, జీఎస్ఐ, ఎన్‌జీఆర్ఐ, ర్యాట్ హోల్ మైనర్స్, ఐఐటీ మద్రాస్ ప్రొఫైసర్లు, కేరళ కాడవర్ డాగ్స్, రోబోటిక్ వంటి 12 రకాల బృందాలకు చెందిన 560మంది సహాయక సిబ్బంది పాల్గొంటున్నారు. సహాయక కార్యక్రమంలో ఆర్మీ అధికారులు వికాస్‌సింగ్, విజయ్‌కుమార్, జేపీ కంపెనీ సీనియర్ ప్రాజెక్టు ఇంజినీర్ సంజయ్‌కుమార్ సింగ్, సింగరేణి మైన్స్ రెస్క్యూ జనరల్ మేనేజర్ బైద్య, ఎన్‌డీఆర్ఎఫ్ అధికారి గిరిధర్‌రెడ్డి, హైడ్రా అధికారి, దక్షిణ మధ్య రైల్వే అధికారి రవీంద్రనాథ్ పాల్గొన్నారు.

పీయూ రిజిస్ట్రార్‌గా రమేష్‌బాబు



రమేష్‌బాబుకు అభినందనలు తెలుపుతున్న వీసీ శ్రీనివాస్ తదితరులు

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీ నూతన రిజిస్ట్రార్‌గా రమేష్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో రిజిస్ట్రార్‌గా పనిచేసిన చెన్నప్ప వ్యక్తిగత కారణాలతో బాధ్యతల నుంచి తప్పుకున్నారు. దీంతో ఉస్మానియా యూనివర్సిటీ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో సీనియర్ ప్రొఫెసర్‌గా పనిచేసిన రమేష్‌బాబును రిజిస్ట్రార్‌గా నియమించారు. ఈ క్రమంలో ఆయన ఇటీవల ఓయూ నుంచి రిలీవ్ కాగా.. సోమవారం పీయూలోని రిజిస్ట్రార్ చాంబర్‌లో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా పీయూ వైస్ చాన్స్‌లర్ శ్రీనివాస్ ఆయనకు శాలువా, పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రకిరణ్, ప్రిన్సిపాల్ మధుసూదన్ రెడ్డి, కంట్రోలర్ రాజ్‌కుమార్, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ రవికాంత్, ఎంఈడీ కళాశాల ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు, రేపు జెడ్ఆర్ఈఏసీ సమావేశం

బిజినేపల్లి : మండలంలోని పాలెం వ్యవసాయ పరిశోధన సంస్థలో మంగళ, బుధవారాల్లో జెడ్ఆర్ ఈఏసీ సమావేశం నిర్వహించనున్నట్లు పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డా.సి.సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 8, 9వ తేదీల్లో ఉదయం పది గంటల నుంచి ప్రారంభమయ్యే దక్షిణ తెలంగాణ మండల వ్యవసాయ పరిశోధన, విస్తరణ సమావేశంలో పలు అంశాలపై చర్చించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులు, రైతులు, వ్యవసాయ అనుబంధ రంగాల అధికారులు పాల్గొంటారని వివరించారు.

నకిలీ వైద్యులపై కొరడా

- మెడికల్ కౌన్సిల్ దాడులు
- దేవరకద్రలో మూడు ఆస్పత్రులు సీజ్
- కేసులు నమోదు

దేవరకద్ర రూరల్: నకిలీ వైద్యులపై తెలంగాణ వైద్య మండలి అధికారులు కొరడా ఝళిపించారు. దేవరకద్రలో నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్‌లో పలువురు వైద్యులు అర్హతలేని వారిగా తేలింది. ఇలాంటి నకిలీ వైద్యుల ఆటకట్టించేందుకు మెడికల్ కౌన్సిల్ సిద్ధమైంది. తనిఖీలు చేపట్టి ఆస్పత్రులు సీజ్ చేయడంతో వారిపై కఠిన చర్యలు తీసుకోనుంది. సోమవారం నిర్వహించిన స్టింగ్ ఆపరేషన్ అనంతరం రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ వైస్ చైర్మన్ శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. దేవరకద్రలో నేషనల్ మెడికల్ కౌన్సిల్ లేదా తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్‌లో గుర్తింపు లేకుండా చికిత్స అందిస్తున్న మూడు ఆస్పత్రులను గుర్తించారు. సత్యసాయి క్లినిక్‌లో వైద్యుడు డిప్లొమా హోమియో డిగ్రీ చేసి ఆస్పత్రిలో 10 బెడ్స్ ఏర్పాటు చేసి ఇష్టానుసారంగా రోగులకు, గర్భిణులకు వైద్యం చేస్తున్నట్లు గుర్తించారు. ఈ విషయంపై వైద్యుడిని వివరణ కోరగా దురుసుగా ప్రవర్తించినట్లు తెలిపారు. కోయిల్‌సాగర్ రోడ్డులో ఉన్న అమ్మ క్లినిక్, రైల్వే ట్రాక్ సమీపంలోని శ్రీసాయి క్లినిక్‌లో సైతం వైద్యులు వైద్యార్హతకు మించి వైద్యం చేస్తున్నట్లు గుర్తించామన్నారు. వీరంతా హోమియోపతి చేసి నిబంధనలకు విరుద్ధంగా అల్లోపతి వైద్యం అందిస్తున్నరని విచారణలో తేలింది. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 420 మంది నకిలీ వైద్యులను గుర్తించి కేసులను నమోదు చేసినట్లు తెలిపారు.



దేవరకద్రలో ఆసుపత్రిని సీజ్ చేస్తున్న జిల్లా అధికారులు

చట్టపరంగా చర్యలు తీసుకుంటాం

మెడికల్ కౌన్సిల్ సభ్యుల సమాచారంతో అధికారులు గుర్తించిన క్లినిక్‌లను సీజ్ చేశాం. నకిలీ వైద్యులపై కేసు నమోదు చేయడంతో పాటు మెడికల్ కౌన్సిల్ ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

– మంజుల, జిల్లా మీడియా అధికారి

11 నుంచి 13వ తేదీ వరకు సలేశ్వరం జాతర

నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్: నల్లమల లోతట్టు ప్రాంతంలోని సలేశ్వరం జాతరకు అధికారులందరూ సమన్వయంతో పనిచేసి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తిచేయాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో, అదనపు కలెక్టర్ దేవసహాయం, జిల్లా అటవీ శాఖాధికారి రోహిత్ గోపిడితో కలిసి జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెంచుల ఆరాధ్య దైవం సలేశ్వర లింగమయ్య జాతరను అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 11, 12, 13 తేదీల్లో (మూడురోజుల పాటు) నిర్వహించనున్నామన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలకు కావాల్సిన సదుపాయాలు, వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలోని లోయలో కొలువుదీరిన లింగమయ్య దర్శనార్థం ఇతర రాష్ట్రాలు, రాష్ట్ర నలుమూలల నుంచి ప్రజలు తరలి వస్తారన్నారు. జాతర రోజుల్లో వైద్యాధికారులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలని, జిల్లా పంచాయతీ శాఖ ఆధ్వర్యంలో జాతరలో ఎప్పటికప్పుడు శానిటేషన్ పనులు నిర్వహించడంతో పాటు ఎక్కడ కూడా అపరిశుభ్రత లేకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్, బందోబస్తు, ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని, పోలీసులు తమ విధులు సక్రమంగా నిర్వహించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. భక్తులకు తాగునీటి సౌకర్యాన్ని కల్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు చెప్పారు. ప్రజలకు సరిపడా రవాణా సదుపాయం కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు, ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక సిబ్బందితోపాటు ఫైరింజన్‌ను అందుబాటులో ఉంచాలన్నారు. జిల్లా అటవీ అధికారులు సరైన రోడ్డు సౌకర్యం కల్పించాలని, మూడురోజులపాటు జరగనున్న జాతరలో సోలార్ లైట్లు ఏర్పాటు చేయాలని డీటీడబ్ల్యూఓ అధికారులను ఆదేశించారు. గతేడాది అనుభవాలను దృష్టిలో ఉంచుకొని సరైన చర్యలు చేపట్టాలన్నారు. అచ్చంపేట ఆర్డీఓను సలేశ్వరం జాతర నోడల్ అధికారిగా నియమించామన్నారు.

సిర్సనగండ్లలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

చారకొండ: సిర్సనగండ్ల సీతారామచంద్ర స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆలయ పాలక వర్గం ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సోమవారం స్వామివారికి పంచామృత, అభిషేకం, తులసిసహస్ర నామార్చన, వేదపారాయణం, కుంకుమార్చనను నిర్వహించారు. రాత్రికి ప్రదోష, రాజోపచరాలు, పూలతేరు నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ రామశర్మ, ఈఓ ఆంజనేయులు తెలిపారు. గుట్టపై స్వామివారి దర్శనం అనంతరం భక్తులు జాతరలో మిఠాయిలు, గాజులు, ఆటబొమ్మలు వంటివి కొనుగోలు చేస్తూ సరదాగా గడిపారు.

సత్యహరిశ్చంద్ర నాటకంలో ఎమ్మెల్సీ గోరటి

శ్రీరామ నవమిని పురస్కరించుకొని మద్దూరు మండలం చింతల్‌దిన్నెలో ఆదివారం రాత్రి మారుతి నాటక కళామండలి ఆధ్వర్యంలో సత్యహరిశ్చంద్ర నాటకం ప్రదర్శించారు. పోతుల హన్మంత్‌రెడ్డి సంగీత దర్శకత్వంలో నిర్వహించిన నాటక ప్రదర్శనలో ప్రధాన ఘట్టమైన కాటి సీనులో ప్రముఖ కవి, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న సత్యహరిశ్చంద్రుడి పాత్రలో నటించి ప్రేక్షకులను అలరించారు. విశ్వమిత్రుడిగా రాములు, చంద్రమతిగా అంజలి, గ్రామానికి చెందిన కళాకారులు అరుణ, బాలయ్య, నర్సింహులు, నీలప్ప, మొగులప్ప, వెంకటప్ప, మోహన్‌రెడ్డి వివిధ పాత్రలు పోషించారు. కార్యక్రమంలో జిల్లా కళాకారుల సంఘం అధ్యక్షుడు డా.చక్రధర్ పాల్గొన్నారు.– మద్దూరు



హత్య కేసులో వ్యక్తికి యావజ్జీవ కారాగార శిక్ష



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ యోగేశ్ గౌతమ్

కొత్తపల్లి: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధించారని నారాయణపేట ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ఈ ఘటనకు సంబంధించి సోమవారం వివరాలను ఎస్పీ విలేకరులకు వెల్లడించారు. నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన గోవిందు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌లో పనిచేసుకుంటూ భార్య, అంగవైకల్యం గల కూతురు(24)తో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో 2022 ఫిబ్రవరి 13న జోగు వెంకట్రాములు అనే వ్యక్తి యువతికి మాయమాటలు చెప్పి తీసుకెళ్లాడని తెలిసి రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్‌లో 15న ఫిర్యాదు చేశాడు. అయితే 18న సాయంత్రం 4 గంటల సమయంలో బంధువైన గొల్ల రాజు ఫోన్ చేసి మీ కూతురు కాలిన గాయాలతో మద్దూరు ఆస్పత్రిలో ఉందని చెప్పగా వెంటనే మద్దూరుకు వచ్చారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం నారాయణపేట, మహబూబ్‌నగర్ జనరల్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో యువతితో ఆరా తీయగా.. వింజమూర్ గ్రామానికి చెందిన జోగు వెంకట్రాములు మద్దూరు గురుకుల హాస్టల్ వెనకాల చెట్ల పొదల్లో తీసుకెళ్లి బలవంతం చేయడానికి ప్రయత్నించగా నిరాకరించడంతో పెట్రోల్ పోసి నిప్పంటించాడని వాంగ్మూలం ఇచ్చింది. ఈ క్రమంలోనే చికిత్స పొందుతూ 19న మృతి చెందింది. ఈ మేరకు మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి.. కోస్గి సీఐ జనార్దన్ ఇన్వెస్టిగేషన్ చేసి కోర్టులో చార్జీషీటు దాఖలు చేశారు. డీఎస్పీ లింగయ్య సూచన మేరకు ప్రస్తుత సీఐ సైదులు, ఎస్ఐ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో లైజనింగ్ ఆఫీసర్, ఏఎస్ఐ కృష్ణయ్య సీడీఓ విజయ్‌కుమార్, నర్సింహులు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా పీపీ బాలప్ప కోర్టులో వాదనలు వినిపించగా నేరం రుజువైంది. సోమవారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎండీ రఫీ నేరస్తునికి యావజ్జీవ కారాగార శిక్షతో పాటు రూ.5వేల జరిమానా విధించారు. ఈ కేసులో నేరస్తునికి శిక్ష పడటంలో కృషిచేసిన ప్రతిఒక్కరిని రివార్డు అందజేస్తామని ఎస్పీ చెప్పారు.

వైభవంగా రామయ్య పట్టాభిషేకం



లక్ష్మీసదనంలో రామయ్య పట్టాభిషేకం నిర్వహిస్తున్న పురోహితులు



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మహబూబ్‌నగర్ రూరల్: మన్యంకొండ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం శ్రీరాముడి పట్టాభిషేక మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. శ్రీరామ నవమిని పురస్కరించుకొని రామయ్య పట్టాభిషేకం కార్యక్రమాన్ని సంప్రదాయ రీతిలో నిర్వహించారు. ఈసందర్భంగా సన్నాయి వాయిద్యాలు, పురోహితుల వేదమంత్రాలు, భక్తుల హరినామస్మరణ మధ్య శోభాయమానంగా అలంకరించిన పల్లకిలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను గర్భగుడి నుంచి లక్ష్మీవిలాసం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. లక్ష్మీవిలాసం సదనంలో పురోహితులు పట్టాభిషేకం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉత్సవ మూర్తులకు పట్టువస్త్రాలు, వివిధ రకాల పూలతో అలంకరించారు. వేడుకలో ప్రధాన ఘట్టం స్వామివారికి స్వర్ణకిరీట ధారణను కనులపండువగా నిర్వహించారు. భక్తులు కనులారా తిలకించి తన్మయం చెందారు. పట్టాభిషేకం అనంతరం స్వామి దంపతులను పల్లకిలో గర్భగుడి వద్దకు తీసుకుచ్చి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. దేవస్థానం చైర్మన్ అళహరి మధుసూదన్‌కుమార్, ఈఓ శ్రీనివాసరాజు, సూపరింటెండెంట్ నిత్యానందాచారి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.